క్లుప్తంగా

నేడు గడప గడపకు

తవణంపల్లె: తవణంపల్లె పంచాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు పాల్గొంటారని ఎంపీపీ గీతారెడ్డి, ఎంపీడీఓ ఎస్.అబ్దుల్‌కలామ్ ఆజాద్ తెలిపారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని, పథకాలు అమలుపై ఆరా తీస్తారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు పాల్గొనాలని తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

బంగారుపాళెం: మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని ఆదివారం డీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రధాన గేటు వద్ద ఈమేరకు నిరసన వ్యక్తం చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎంఈఓ-2గా రమేష్‌బాబు

బంగారుపాళెం: మండల విద్యాశాఖ అధికారి-2 గా రమేష్‌బాబు నియమితులైనట్లు ఎంఈఓ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈయన బోడబండ్ల హెచ్‌ఎంగా పనిచేస్తున్నారన్నారు. గతంలో అసిస్టెంట్ మానటరింగ్ అధికారి (ఏఎంఓగా) విధులు నిర్వహించారు. ఆదివారం ఎంఈఓ-2గా బాధ్యతలు చేపట్టారు.

నా భూమి ఆక్రమించారు సారూ..

చిత్తూరు రూరల్: ఆక్రమణకు గురైన తమ భూమిని తిరిగి ఇప్పించాలని ఐరాల మండలం పందికొట్టూరుకు చెందిన నాగభూషణం కోరాడు. ఆదివారం చిత్తూరు నగరంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడాడు. ముదిగోలం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలాలో తమ అనుభవంలో ఉన్న భూమిని నాగరాజులు నాయుడు అనే వ్యక్తి ఆక్రమించుకుని మామిడి చెట్లు నాటాడని ఆరోపించాడు. అతని దౌర్జన్యాన్ని ప్రశ్నిస్తే తనను చంపడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆక్రమణకు గురైన భూమిని సర్వే చేసి తనకు అప్పగించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు.

వినాయకుని సేవలో పుదుచ్చేరి సీఎస్



స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని పుదుచ్చేరి చీఫ్ సెక్రటరీ రాజీవ్ వర్మ దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ఆయన కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని ఏఈఓ అందించారు.

జగనన్న పల్లెవెలుగు సర్వే చేయండి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఎల్‌ఈడీ వీధిదీపాల ఏర్పాటు కోసం జగనన్న పల్లెవెలుగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి పల్లెలో పంచాయతీ కార్యదర్శి, కార్యాలయ సిబ్బంది, ఎనర్జీ కార్యదర్శులు టీమ్‌గా ఏర్పడి ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ, ట్రాన్స్‌కో ఏఈల పర్యవేక్షణలో పోల్ టు పోల్ సర్వే నిర్వహించాలన్నారు. ఇందులో ఎన్ని విద్యుత్ స్తంభాలు ఉన్నాయి ? అందులో ఉన్న వీధిదీపాల సంఖ్య ఎంత ? ఎన్ని పని చేయడ లేదు ? ఎన్నింటికి మీటర్లు ఉంది అనే నివేదిక సిద్ధం చేయాలన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

శ్రీరంగరాజపురం : వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 2 ద్విచక్ర వాహనాలను సోమవారం ఉదయం 11 గంటలకు వేలం డీఎస్పీ సమక్షంలో వేలం వేయనునట్లు ఎస్‌ఐ షెక్షావలి తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా ధరావత్తు చెల్లించాలని సూచించారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్ వారు నిర్ణయించిన ధర కంటే హెచ్చు పాడిన వారికి వాహనాలను అప్పగిస్తామని తెలిపారు.

ఆగస్టు 7న జాతీయ ఓబీసీ మహాసభ

తిరుపతి కల్చరల్: బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ఆగస్టు 7వ తేదీన తిరుపతి నగరంలో భారీ స్థాయిలో జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహించనున్నట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ నిర్వహణపై వివిధ జిల్లాల నేతలతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ గతంలో బీపీ మండల్ కమిషన్ ఇచ్చిన నివేదికను అమలు చేయడంలో ప్రభుత్వాలు వివక్ష చూపాయని, దీంతో బీసీల బతుకులు మరింత దిగజారాయన్నారు. దేశ వ్యాప్తంగా బడుగు, బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సుమారు 85 శాతం ఉన్నా అభివృద్ధి శూన్యమన్నారు. బీపీ మండల్ నివేదిక సమర్పించిన రోజైన ఆగస్టు 7వ తేదీన తిరుపతి నగరంలో నిర్వహించనున్న జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.





ఐరాల మండలం చిన్నవెంకటంపల్లెలో వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ భవనం, ఐరాల మండలం పి.కట్టకింద పల్లెలో ఇంటి వద్ద చికిత్స చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్

పల్లె ఆరోగ్యానికి భరోసా

- గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు
- ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటింటికీ వైద్య సేవలు
- ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

గతంలో మెరుగైన వైద్య సేవల కోసం గ్రామీణ ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సి దుస్థితి. ఆర్థిక స్తోమత లేనివారు చికిత్స చేయించుకోలేక మంచానికే పరిమితమయ్యేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వైద్యానికి పెద్దపీట వేసింది. గ్రామీణ ప్రజలకు మెరుగైన నాణ్యమైన వైద్యం అందించేందుకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 108, 104 వాహనాలు వెళ్లని గ్రామాల్లో కూడా నేడు ప్రజలకు చికిత్సలు అందుతున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఆస్పత్రికి వెళ్లలేని రోగుల వద్దకే డాక్టర్లు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు.

యాదమరి: పూతలపట్టు నియోజకవర్గంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోంది. నియోజకవర్గంలో పూతలపట్టు, యాదమరి, బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల మండలాలు ఉన్నాయి. ఈ మండలాలలో 65 వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లు నిర్మిస్తున్నారు. వీటిలో 80 శాతం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలకు మొదటగా రూ.17.50లక్షలు ప్రభుత్వం కేటాయించగా, పెరిగిన ముడి సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో రూ.3లక్షలు పెంచారు. ప్రస్తుతం వీటి నిర్మాణాలు చకచకా జరుగుతున్నాయి. పూతలపట్టు, యాద మరియ ఐరాలలో భవనాలు ప్రారంభించి సేవలు పూర్తి స్థాయిలో అందిస్తున్నారు. మిగిలిన చోట్ల అందుబాటులో ఉన్న భవనంలోనే వైద్య సేవలు అందుతున్నాయి.

2500 జనాభాకు ఒక సెంటర్

ప్రతి 2500 జనాభాకు ఒక హెల్త్ సెంటర్ చొప్పున నూతన భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారు. హెల్త్ సెంటర్‌లో 14 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. 68 రకాల మందులు అందుబాటులో ఉంచారు. హెల్త్ సెంటర్‌లో ఒక ఎంఎల్‌హెచ్‌పీతో పాటు ఏఎన్‌ఎం, ఆశ వర్కర్‌లను అనసంధానం చేశారు.

నియోజకవర్గంలో ఇలా

- యాదమరిలో 8 వైఎస్సార్ విలేజ్ క్లీనిక్‌లు మంజూరు కాగా, ఐదు పూర్తి అయ్యాయి. మిగిలినవి తుది దశల్లో ఉన్నాయి.
- బంగారుపాళ్యం మండలంలో 26 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు గాను ఎనిమిది భవనాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.
- పూతలపట్టు మండలంలో 8 వైఎస్సార్ విలేజ్ క్లీనిక్‌లకు గానూ నాలుగు భవనాలు పూర్తి అయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.
- ఐరాల మండలంలో 12 వైఎస్సార్ విలేజ్ క్లీనిక్‌లు మంజూరు కాగా, ఐదు భవనాలు పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.
- తవణంపల్లె మండలంలో 11 వైఎస్సార్ విలేజ్ క్లీనిక్‌లు మంజూరు కాగా, ఐదు భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

ఇంటి వద్దకే వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటి వద్దకే వైద్యం అందుతోంది. ప్రతి గ్రామాన్ని నెలలో రెండు సార్లు వైద్యులు, సిబ్బంది సందర్శించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపీ చూస్తున్నారు. ఆపై గ్రామంలో మంచంపై ఉన్నవారు, నడవలేనిస్థితిలో ఉన్న ఇతర వ్యాధిగ్రస్థుల ఇంటికే వెళ్లి వైద్యం అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య స్థితిగతులు రికార్డు చేస్తున్నారు.

ప్రణాళిక ప్రకారం శిబిరాలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామానికి రెండు సార్లు 104 వాహనంతో వెళ్తున్నాం. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో ఓపీ చూస్తున్నాం. తర్వాత మంచానికే పరిమితవారి ఇంటి వద్దకు వెళ్లి వైద్యం చేస్తున్నాం. 68 రకాల మందులను విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో అందుబాటులో ఉంటోంది. రోజూ అన్ని హెల్త్ క్లీనిక్‌ల నుంచి సమాచారం తీసుకుంటున్నాం. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

–రేఖ, మండల వైద్యాధికారి, యాదమరి

ప్రతి నెల మందులు ఇస్తున్నారు.



నాకు మోకాళ్ల నొప్పులు ఎక్కువుగా ఉన్నాయి. నేను బయట తిరగలేను వైద్యం కోసం గతంలో పట్టణాలలో పెద్దాసుపత్రులకు వెళ్లి చికిత్సలు చేసుకునేదాన్ని. ప్రస్తుతం వైద్యులు ఇంటి వద్దకే వస్తున్నారు. అవసరమైతే రక్త పరీక్షలు చేస్తున్నారు. వెంటనే మందులు ఇస్తున్నారు. చాల నయం అవుతోంది. నెలకు రెండు సార్లు వచ్చి సరిపడా మందులు ఇస్తున్నారు. బలానికి మందులు ఇస్తున్నారు.

–ఈశ్వరమ్మ, టీపీ కొత్తపల్లె(పూతలపట్టు)

గ్రామంలోనే వైద్య సేవలు



మా గ్రామం అటవీప్రాంతంలో ఉంది. మాకు ఏ అత్యవసర వైద్యం, ఇతర సమస్యలు వచ్చినా బంగారుపాళ్యం, చిత్తూరు, పలమనేరుకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం 108, 104 వాహనాల ద్వారా వైద్యానికి ఇబ్బందులు లేకుండ పోయింది. ప్రతి నెల రెండు సార్లు గ్రామంలోకి వైద్యులు వస్తున్నారు. అక్కడే రక్త పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందిస్తున్నారు. అత్యవసరం అయినప్పుడు 108 వాహనంలో పట్టణాలకు తీసుకెళ్తున్నారు. లేవలేని వారికి ఫ్యామిలీ డాక్టర్ల సహాయంతో ఇంటి వద్దే చికిత్సలు చేస్తున్నారు. గ్రామీణుల కష్టాలు తీరాయి.

–నిదేరాజ, సర్పంచ్ కీరమంద(బంగారుపాళ్యం)

వెల్డింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: వెల్డింగ్ కార్మికుల సమస్యలను అన్ని విధాలుగా పరిష్కరిస్తామని నూతన గౌరవ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. ఆదివారం పట్టణంలో వెల్డింగ్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అలీమ్‌బాషాను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకువచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులకు బీమా సౌకర్యం, ప్రత్యేక గుర్తింపు కార్డులు, హౌసింగ్, జగనన్న కాలనీలలో ఇల్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వెల్డింగ్ కార్మికులు బాషు, నజీర్, బావాజాన్, రియాజ్, అమానుల్లా, ఈశ్వర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడుగా బాషు

వెల్డింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడిగా కెఎస్.బాషును ఎన్నుకున్నట్లు నూతన గౌరవాధ్యక్షుడు అలీమ్ బాషా తెలిపారు. అలాగే ఉపాధ్యక్షుడుగా నజీర్, కార్యదర్శిగా రియాజ్, ఉపకార్యదర్శిగా రజి, కోశాధికారిగా అమానుల్లా, కమిటీ సభ్యులుగా ఖలీల్, ఇమ్రాన్, షమి, ఈశ్వర్‌రాజు, రియాజ్, నూర్‌ను ఎన్నుకున్నారు.

వేదోక్తంగా త్రిశూల ప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్టించిన త్రిశూలం

రొంపిచెర్ల: రొంపిచెర్ల ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం త్రిశూల ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయం దాతల సాయంతో అభివృద్ధి చెందుతుంది. కొందరు దాతలు త్రిశూలం ప్రతిష్టకు విరాళాలను అందజేశారు. వేదపండితులు గుణశేఖర్ ఆధ్వర్యంలో ఆలయంలో వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా త్రిశూలాన్ని ప్రతిష్టించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని, త్రిశూలం వద్ద కొబ్బరికాయలు కొట్టి, హారతులు సమర్పించారు. అర్చకులు ముని రాజ శర్మ తీర్థ ప్రసాదాలు అందించారు.

వినమ్రతతో సేవలు..

- ప్రతి గడపను పలకరిస్తున్న వలంటీర్లు
- సమస్యలు ఉంటే చెప్పాలంటూ విన్నపం
- ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు

అమ్మా నేను వలంటీర్‌ను.. మీ ఇంట్లో ఏవైనా సమస్యలు ఉన్నాయా ? మీకు పథకాలు అందడంతో ఇబ్బందులు తలెత్తాయా ? ఏ సమస్య అయినా చెప్పండి.. మీకు నేను సాయం చేస్తా.. అంటూ వలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలను వినమ్రతతో పలకరించి సేవలందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు అందే మీ తరపున మేమే దరఖాస్తు చేస్తాం అని అడుగుతున్నారు. ఇలా గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా వలంటీర్లు గడప గడపకు తిరుగుతూ ప్రజలతో మమేకమవుతున్నారు.

మండలం, పంచాయతీలు, కుటుంబాలు, వలంటీర్లు			
గంగాధరనెల్లూరు	32	17342	328
శ్రీరంగరాజపురం	23	10670	194
కార్వేటినగరం	21	8903	178
వెదురుకుప్పం	25	12870	234
పెనుమూరు	24	10250	205
పాలసముద్రం	13	6105	111



గ్రామాల్లో ఇంటింటా సమాచారం సేకరిస్తున్న వలంటీర్

పాలసముద్రం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ పట్ల అన్ని వర్గాల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపడమే కాకుండా వారికి ప్రభుత్వ పథకాలను వారి ఇళ్ల వద్దే అందిస్తూ అందరి ఆదరాభిమానాలను చూరగొంటున్నారు వలంటీర్లు. గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా అంతటా వీరు సేవలు అందిస్తున్నారు. తమకు కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలతో మమేకమవుతున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. వలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్లను సందర్శిస్తూ ప్రజలను పరిచయం చేసుకునేందుకు గ్రామాల బాట పట్టారు.

ఇంటి వద్దకే పథకాలు..

గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ ప్రతినిధులే ప్రజల గడప వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకుని నమోదు చేసుకుంటారు. ఆపై పరిష్కారం చూపుతున్నారు. ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించడంతో పాటు వారికి ఆ పథకాలు అందేలా చొరవ చూపుతారు. అయితే గతంలో కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ తమ సమస్యలు ఏమాత్రం తీరేవికావని, కనీసం తమ బాధలు చెప్పకునేందుకు కూడా సరైనా అవకాశం లభించేది కాదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లు రాకతో తమకు అవస్థలు తీరినట్లేనని, ఇక మీదట ఎవరిని ఆశ్రయించాల్సిన పని ఉండదని తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో త్వరితగతిన తీరుతాయని ఆనందపడుతున్నారు.

లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ ఫలాలు..

ప్రభుత్వం ప్రజలకు అందించే ప్రతి సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారుడి ఇంటి వద్దకే వెళ్లి గ్రామ వలంటీర్లు అందజేస్తున్నారు. రేషన్‌కార్డుల్లో మార్పులు, కొత్తగా పింఛన్, రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు కూడా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. కూలీలు, చిరుద్యోగులు తమ పనులు మానుకుని రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. వలంటీర్లకు సమస్య చెబితే చాలు. వారు నమోదు చేసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటు సంక్షేమ పథకాల లబ్ధి అందేలా కృషి చేయనున్నారు.

మంచి అవకాశం..



ముఖ్యమంత్రి నాకు మంచి అవకాశం ఇచ్చారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించింది. ప్రభుత్వ పథకాలను నాకు కేటాయించిన ఇళ్ల వద్దకు ప్రతి లబ్ధిదారుడికి అందజేస్తాం. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తాం. ఈ అవకాశం రావడం నా అదృష్టం. –విజయకుమార్, శ్రీకావేరిరాజుపురం, వలంటీర్

బాధ్యతగా పని చేస్తున్నా..



గ్రామ వలంటీరుగా నాకు అప్పగించిన విధులు సక్రమంగా నిర్వహిస్తున్నా. విధి నిర్వహణలో ఎప్పుడూ నిర్లక్ష్యం వహించలేదు. 50 కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నాను. ప్రజలకు మంచి చేసే అవకాశం రావడం నా అదృష్టం. –జే.దీప, దీనబంధుపురం

ప్రజల ఇళ్ల వద్దకే పథకాలు



వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు ద్వారా సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా ప్రజల ఇళ్ల వద్దకే చేరుతాయి. వలంటీర్‌గా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అన్ని సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు కృషి చేస్తున్నా. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తున్నా. సంక్షేమ పథకాలతో పాటు వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ఎటువంటి లబ్ధి అయినా సరే అందే వరకు కృషి చేస్తాను. –ఎం.కల్పన, నరసింహపురం, పంచాయతీ

గౌరవంగా భావిస్తున్నా..



ప్రభుత్వం కల్పించిన వలంటీర్ జాబ్ నా కుటుంబానికి ఆర్థిక ఆసరాగా నిలబడడంతో పాటు, గ్రామ ప్రజలకు సేవ చేసే అదృష్టం దక్కింది. దీన్ని ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. అధికారులు నాకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేస్తాను. నాకు కేటాయించిన కుటుంబాల్లోని వారికి సంక్షేమ ఫలాలు త్వరగా అందేలా చూస్తాను. –ఎం.ప్రసన్న, వెంగళరాజుకుప్పం, పంచాయతీ

సీఎం మేలు మరువలేను..



గ్రామ వలంటీరుగా శిక్షణలో అన్ని విషయాలు తెలుసుకున్నాను. 50 కుటుంబాల వారికి సేవ చేసే అవకాశం కల్పించడమే కాకుండా గౌరవ వేతనంగా రూ.5 వేలు ఇస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మేలును మరచిపోలేను. వలంటీరుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్నా. –పి.పవిత్ర, పాలసముద్రం

నేడు పోలీసు కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న ఆర్మడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన జరుగుతుందని, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్యలో స్పందన జరుగుతుందన్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందజేయవచ్చన్నారు. అలాగే ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సాప్–98499 07885 కు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో ..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో స్పందన జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చన్నారు.



రోడ్డుకు ఇరువైపులా ఆపి ఉన్న లారీలు

జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద ఇక్కట్లు

గుడిపాల: జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద భారీగా వాహనాలు నిలుస్తుండడంతో ఇతర వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. మండలంలోని చిత్తూరు–వేలూరు రహదారిలో రెండు జ్యూస్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీలకు మామిడి కాయలను వాహనాల్లో తీసుకొస్తారు. అయితే ఈ వాహనాలన్నీ రోడ్డుపైనే రెండు వైపులా నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. గత రెండు రోజులుగా కిలోమీటర్ల మేర వాహనాలన్నీ నిలిచిపోయాయి. దీనికితోడు డ్రైవర్లు రోడ్డుపక్కన మద్యం సేవించి తగాదాలు పడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ఎర్రావాండ్లపల్లెలో ప్రచారం చేస్తున్న సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని ఎర్రాండ్లపల్లెలో ఆదివారం త్రైతసిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలపై బంగా రుపాళెం కమిటీ–2 సభ్యులు ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షు డు ధనంజయ మాట్లాడుతూ. సమాజంలో కులమ తాలను రూపుమాపాలన్నా, అసమానతలను తొలగించాలన్నా భగవద్గీత చదవాలని తెలిపారు.

మోడల్ స్కూల్ ఎంట్రన్స్ ఫలితాల విడుదల



హాసిని, సాహిత్య, అబ్దుల్ ఇర్ఫాన్

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను ప్రిన్సిపల్ సరళ ఆదివారం విడుదల చేశారు. పరీక్షల కోసం 91 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో 73 మంది మాత్రమే హాజరయ్యారని, మొదటి రౌండ్‌లో 40 మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశ పరీక్షలో అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. సంతోష్ 74 మార్కులు, వి.హాసిని 72 మార్కులు, అబ్దుల్ ఇర్ఫాన్ 71, జి.సాహిత్య 71 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. కటాఫ్ మార్కులు తగ్గించి రెండవ రౌండ్‌లో మరి కొందరిని ఎంపిక చేసే అవకాశం ఉందని వెల్లడించారు. అర్హత సాధించిన విద్యార్థులు టీసీ, ఆధార్ కార్డులతో వచ్చి పాఠశాలలో చేరాలని సూచించారు.

కల్కి ఆశ్రమంలో ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ స్పీకర్



శాంతరాం నేతంకు స్వాగతం పలుకుతున్న ఆర్డీఓ


రామకుప్పం: మండలకేంద్రానికి సమీపంలోని కల్కి ఆశ్రమంలో ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ శాంతరాం నేతం ఆదివారం సత్యలోకం చేరుకున్నారు. కుప్పం ఆర్డీఓ శివయ్య ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. సోమవారం ఉదయం ప్రత్యేక పూజల్లో డిప్యూటీ స్పీకర్ పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకుప్పం తహసీల్దార్ మురళీ, ఎస్‌ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిసిన శశాంక్



పలమనేరు: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో పలమనేరు పట్టణానికి చెందిన బి.శశాంక్ జాతీయ స్థాయిలో ఓబీసీ విభాగంలో రెండో ర్యాంకు సాధించాడు. పట్టణంలోని సాయినగర్‌లో చెందిన సామాజిక సేవకుడు, బిల్డర్ గణేష్‌యాదవ్ కుమారుడు శశాంక్. బెంగళూరులో ప్రాథమిక విద్య, ఆపై ప్రయివేటు కళాశాలలో ఇంటర్ చదివాడు. అన్ని పరీక్షల్లోనూ టాపర్‌గా నిలిచాడు డబ్బుకంటే చదువే ముఖ్యమని తాను కష్టపడి చదివినట్లు విద్యార్థి తెలిపాడు. ఇందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో మెరిసిన ఈ ఆణిముత్యాన్ని విద్యావేత్తలు మెచ్చుకుంటున్నారు.

సీనియారిటీ ప్రకారమే ప్రమోషన్లు కల్పించండి



మాట్లాడుతున్న వెంకటముని

పుత్తూరు రూరల్: ప్రభుత్వ, పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులను ఉమ్మడి సీనియారిటీ ప్రకారమే ఎంఈఓలుగా ప్రమోషన్లు కల్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఏపీటీఎఫ్ డివిజన్‌స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పనిచేస్తున్న ఎంఈఓలను ఎంఈఓ–1గా కొనసాగించాలని కోరారు. ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను రూపొందించడంలో ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, రమేష్, నరేంద్ర, అమర్‌నాథ్ రెడ్డి, మావుళ్లయ్య, కన్నెప్ప, విజయ్, గుర్రప్ప, శరవణ, బాబు పాల్గొన్నారు.